క్లుప్తంగా

చిత్రలేఖనం పోటీల్లో ఉపాధ్యాయుడి ప్రతిభ

టెక్కలి: ఆడపిల్లల రక్షణ అనే అంశంపై తెలంగాణా రాష్ట్రం హనుమకొండకు చెందిన సాగంటి ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పోటీల్లో టెక్కలి మండలం రావివలస పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు మార్పు నారాయణమూర్తికి ప్రథమ స్థానం లభించింది. ఈ మేరకు సోమవారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.భారతితో పాటు ఇతర ఉపాధ్యాయులు ఆయన్ని అభినందించారు.

సామాజిక కార్యకర్తకు సత్కారం



రమణమూర్తి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త తంగి రమణమూర్తి దంపతులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు చిన్నవాడు, అర్జునుడు మాట్లాడుతూ.. రమణమూర్తి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పాఠశాల అదనపు గది నిర్మాణానికి, గ్రామం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి సూరిబాబు, బి.సావిత్రమ్మ, గేదెల శివారెడ్డి, గ్రామ పెద్దలు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



చిన్న కేశనాయుడుపేటలో కాలువలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని హెచ్.ఎస్.పేట, కె.లింగూడు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు సోమవారం నిర్వహించారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లారు. మంచినీటి ట్యాంకర్లలో క్లోరినేషన్ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాల మహాలక్ష్మి, టి.నారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్ ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

కోటబొమ్మాళి: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ అన్నారు. కొత్తపేట పంచాయతీలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను సోమవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.నిర్మలకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు.

నేడు వాహనాల వేలం

సోంపేట: సోంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో సారా, అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేస్తున్నట్టు సీఐ జైభీమ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేషన్ ఆవరణలో ఉదయం 11గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాలను పరిశీలిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: శిక్షా సప్తాహ్ వార్షికోత్సవాలు ముగింపులో భాగంగా మధ్యాహ్న భోజం పథకం నిర్వహణను స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పరిశీలించారు. కర్తలి ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం వంటకాలను, పిల్లల చదువులు, వారి ఆరోగ్యంపై సమీక్షించారు.

కళాకారులకు అవార్డులు



లింగమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన కళాకారులు పెద్దిని ధనవతి, పరపటి లింగమూర్తిలు స్వర్ణ నంది అవార్డులను అందుకున్నారు. హైదారాబాద్ చిక్కడపల్లిలో ఆదివారం త్యాగరాజు గాన సభ జరిగింది. ఇందులో భాగంగా కళారంగంలో అత్యుత్తమ సేవలు అందించిన వీరికి కళాకార్ సేవారత్న అవార్డులను నిర్వాహకులు ప్రదానం చేశారు.

ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించాలి

కాశీబుగ్గ: గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో సుమారు ఐదేళ్లగా సేవలు అందిస్తున్న తమకు అన్యాయం చేయవద్దని ప్రభుత్వ వైద్యులు కోరారు. పీజీ పరీక్షలలో తాము విధుల్లో చేరినప్పటి నిబంధనలు మార్చి అన్యాయం చేయవద్దన్నారు. ఈ మేరకు పలాసలో ఎమ్మెల్యే గౌతు శిరీషను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వీస్ కోటాను కొనసాగించాలని, పాత పద్ధతిలో ఇన్ సర్వీస్ అమలయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వైద్యులు సునీల్‌కుమార్, సంపత్‌రావు, విజయ్‌కుమార్‌రెడ్డి, దేవి, సాయి, శివ, పృథ్వీ ఉన్నారు.

సాయం..



వజ్రపుకొత్తూరు మండలం నారాయణరావుపేటకు చెందిన నిరుపేద విద్యార్థి జుత్తు పూజ ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఆమె చదువు కోసం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ అండగా నిలిచింది. ఫీజుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం చేయాలని సొసైటీ సభ్యులు నిర్ణయించారు. ఈ మొత్తాన్ని పూజకు సోమవారం అందజేశారు. చదువుకయ్యే ఖర్చు మొత్తాన్ని తమ సొసైటీ భరిస్తోందని సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కొయ్యల చంటి, సభ్యులు జి.పుష్ప, పురుషోత్తం, ప్రకాష్, బత్తిన మోహనరావు, షణ్ముఖరావు, పండా, వంక జోగారావు ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు

ప్రారంభం

క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులు అలవర్చుకోవాలని ఎంఈవోలు జలుమూరు చిన్నవాడు, అర్జునుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం కేశనాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన డైనింగ్‌హాల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత శిఖరాలను చేరుకొని గ్రామానికి, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాల మహాలక్ష్మి, పాల మహేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు గిరిధర్ శర్మ, మోహన్‌రావుఉన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.

– సంతబొమ్మాళి



రైతుల సేవలో..



తోటి రైతుల మేలు కోసం తన వంతు సహకారం అందించాడు సుంకర జగన్నాథపురం గ్రామానికి చెందిన రైతు గంగిట్ల రామారావు. పదేళ్లుగా పిల్ల కాలువ పనులు చేపట్టక ముల్లపొదలు, పూడికతో అస్తవ్యస్తంగా తయారైంది. వంశధార శివారు ప్రాంతాలకు సాగు నీరు వస్తున్నప్పటికీ తమ గ్రామ రైతులకు ఉపయోగపడడం లేదని రైతులు ఆవేదనను రామారావు గుర్తించారు. గ్రామం పక్కనుంచి పోతున్న వంశధార 60 ఆర్ఎల్ కాలువ సాగు నీటిని బోయిన చెరువుకు పంపించిందుకు పనులు చేపట్టాడు. సోమవారం తన సొంత నిధులతో సర్పంచ్ గాడి అఖిల్ సమక్షంలో జేసీబీతో పనులు పూర్తి చేసి చెరువుకు నీరు తరలించారు. రామరావును సర్పంచ్ అఖిల్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు.

–వజ్రాకొత్తూరు

పాఠశాలల్లో సహపంక్తి భోజనాలు



ఇచ్ఛాపురం రూరల్: కె.శాసనాం పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంపీపీ బోర పుష్ప

టెక్కలి రూరల్: మండలంలోని బూరగాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సహపంక్తి భోజనాలను ప్రధానోపాధ్యాయులు జి.రాము ఏర్పాటు చేశారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా చివరి రోజున పిల్లల తల్లిదండ్రులతో పాటు గ్రామ పెద్దల సహకారంతో భోజనాలు పెట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాము మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వీకుల కట్టుబాట్లను మన ముందు తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో అందరి సహకారంతో సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. గ్రామ పెద్దలు జి.రమణయ్యరెడ్డి, రూపవతి, కృష్ణా రెడ్డి, సంజీవ్ రెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, అచ్యుతరావు, అలివేలు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలి

ఇచ్ఛాపురం రూరల్: పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా కె.శాసనాం పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 'శుబ్‌దిన్ భోజన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. కొళిగాం, ధర్మపురం ఉన్నత పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు భోజన సదుపాయాన్ని కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బి.చిరంజీవులు, ఎస్.విశ్వనాథం, నరేంద్రనాథ్ పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

సోంపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని ఎంఈవో ఎస్.జొరాడు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇస్కలపాలెం పాఠశాలలో సహపంక్తి భోజనాల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు లలిత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ విశ్వనాథం, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: పాఠశాలలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం చివరి రోజైన సోమవారం శుభదిన్ తిథి భోజన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పాఠశాల చైర్మన్లు, గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.



టెక్కలి రూరల్: విద్యార్థులతో కలసి భోజనాలు చేస్తున్న గ్రామ ప్రజలు



ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం హైస్కూల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన తినుబండారాలు



వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడు పాఠశాలలో భోజనాలు చేస్తున్న గ్రామ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు



సోంపేట: ఇస్కలపాలెం పాఠశాలలో భోజనం చేస్తున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపలిలో పిల్లలకు మిఠాయిలు పంచుతున్న ఉపాధ్యాయులు



వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న గ్రామ పెద్దలు,ఉపాధ్యాయులు

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో ఐ.వి.రమణ

సంతబొమ్మాళి: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, హౌస్ టాక్స్ ప్యూరిఫికేషన్ తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. పంచాయతీ విస్తరణ అధికారి ఎ.గోపాలరావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వజ్రపుకొత్తూరు: కొత్తపేట పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొత్తపేట, దిబ్బవానిపేట గ్రామాలకు చెందిన కూటమి నాయకులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు సోమవారం వినతి పత్రం అందించారు. సామాజిక భవనం నిర్మించాలని, నాడు- నేడు పనులు కొనసాగించాలని, కాలనీలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కూటమి నేతలు కోరారు. మాజీ సర్పంచ్ గోవింద పాపారావు, గీత గణేష్, బైపల్లి నారాయణరావు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ప్రజా సంఘాలు నిరసన

వజ్రపుకొత్తూరు రూరల్:

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని నగరం పల్లిలో సోమవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ జిల్లా నాయకులు టి.భాస్కరరావు, కౌలు రైతు సంఘ నాయకు లు ఎస్.చంద్రయ్య, సీఐటీయూ నాయకులు ఎస్.మోహన్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మొండి చేయి చూపించేదిగా ఉందన్నారు. ప్రధానంగా రైతులకు, కౌలు రైతులకు, ఉపాధి హామీ కూలీలకు ద్రోహం చేసేదిలా ఉందని మండిపడ్డారు. మూడు నల్లచట్టాలను రద్దుచేసి రైతు రుణ విముక్తికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసారు. ఉపాధి హామీ పథకం నిధులు తగ్గింపు కేటాయింపుతో వేతనదారులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. అలాగే రాజధాని నిర్మా ణం, పోలవరం ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయింపులు లేక మళ్లీ రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసారని ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ ప్రస్తావన లేకపోవడంతో ఈ ప్రాంతాల ప్రజల పట్ల కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బమ్మి డి ఆనందరావు, బి.రామక్రిష్ణ, ధర్మారావు, బి.సుగు ణ, లక్ష్మి, టి.యశోధ, రామక్రిష్ణ ఉన్నారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

విద్యార్థినులకు పుస్తకాలు అందజేత



పుస్తకాలతో విద్యార్థినులు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను సోమవారం అందజేశారు. అనంతరం కళాశాలలో జరగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని సూచించారు.నాయకులు దాసరి రాజు, బుద్దాల నిర్మలాదేవి, ధర్మారావు, జాని, కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాశ్యపదాస్ బాబా మృతికి సంతాపం



కాశ్యపదాస్ బాబా (ఫైల్)

కంచిలి: యువతను సన్మార్గంలో నడిపిస్తూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విధంగా తన బోధనలతో చైతన్య పరిచే అలేఖ్ గురువు కాశ్యపదాస్ బాబా ఆదివారం మృతి చెందారు. ఒడిశా రాష్ట్రం నుంచి సుమారు వందేళ్ల క్రితం తలతంపర గ్రామానికి వచ్చి అలేఖ్ ఆశ్రమాన్ని నెలకొల్పినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈయన వయసు వందేళ్ల పైబడి ఉంటుంది. బాబా మృతి సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాలతోపాటు ఒడిశా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి కూడా ఆయన శిష్యులు తరలివచ్చి పార్థివదేహానికి నివాళులర్పించారు. అంతిమ సంస్కారాలను తలతంపర గ్రామంలోని ఆశ్రమం ప్రాంగణంలోనే నిర్వహించారు. బాబా మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు.

కృష్ణమూర్తికి సేవాశ్రీ అవార్డు ప్రదానం


ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన దక్కత కృష్ణమూర్తి రోటరీ క్లబ్ ద్వారా అందించిన సేవలను గుర్తించి రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ వారు సేవాశ్రీ అవార్డును ప్రదానం చేశారు. విశాఖలోన ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం రాత్రి జిల్లా రోటరీ ఇన్‌స్టాల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 28 సంవత్సరాలుగా ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ అధ్యక్షులుగా, కార్యదర్శిగా, గవర్నర్గా, అసిస్టెంట్ గవర్నర్‌గా కృష్ణమూర్తి అందించిన సేవలను గుర్తించిన రోటరీ ఇంటర్నేషనల్ డెరెక్టర్ రాజు సుబ్రహ్మణ్యం సేవాశ్రీ పురస్కారంతో సత్కరించారు. స్థానిక రోటరీక్లబ్ అధ్యక్షులు దినేష్, రోటేరియన్స్ అభినందించారు.



పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తం

టెక్కలి: ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు బి.లక్ష్మణరావు సూచించారు. అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కాలేయ వ్యాధులు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే, ఎన్నో రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని లక్ష్మణరావు వెల్లడించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, జువాలజీ విభాగం అధ్యాపకుడు ఎన్‌హెచ్ కె.జనార్దనరావు, సీహెచ్ సుగునాథనరావు, ఎస్.శివాజీ ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణరావు

భవిత కేంద్రం సందర్శన

ఇచ్ఛాపురం: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధవహిస్తుందని సమగ్రశిక్షా ఐఈ కోఆర్డినేటర్ బి.గోవిందరావు అన్నారు. ముత్యాలమ్మపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రాన్ని కోఆర్డినేటర్ సోమవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం భవితకేంద్రం సహిత ఉపాధ్యాయులకు అవసరమైన సలహాలు సూచనలు చేశారు. సమగ్ర శిక్షా ఐఈ అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఉమా, ఎంఈవో కె.అప్పారావు, పాఠశాల హెచ్ఎం టి.శివకుమార్, సహిత ఉపాధ్యాయులు సూర్యం, సోమేష్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న గోవిందరావు

మొక్కలు నాటివేత

కాశీబుగ్గ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ముత్యాలమ్మకోనేరు వద్ద సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పది రకాల మొక్కలు నాటి వాటికి రక్షణ గార్డులను అమర్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్ అధ్యక్షులు హెచ్.ఎం డుదొర, కార్యదర్శి తమ్మినాన మాధవరావు, ట్రెజరర్ ఎన్.అప్పారావు, వీరఘట్టం వెంకటరావు, పలువురు లయన్ సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో లయన్స్ సభ్యులు

కళింగదళ్ నీటి విడుదల

కాశీబుగ్గ:

మందస మండలం కళింగదళ్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం విడుదల చేశారు. సుమారు 3,600 ఎకరాల ఆయకట్టు సక్రమంగా సాగునీరు అందాలని గంగమ్మకు పూజలు చేసి గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. మందస మండలంలో ఉన్నటువంటి పలు రిజర్వాయర్ల పరిధిలో చిన్నకాలువలు, దేశిబట్టిలు జంగిల్‌క్లియర్ చేయించి నీటిని అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈ వెంకటరమణ, జేఈ మధు, రుక్మిణి బిస్వాల్, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, మాజీ ఎంపీపీ దాసరి తాతారావు, లింగరాజు, కర్రయ్య, రుద్రయ్య, నవీన్, చంద్రశేఖర్, బలరాం భిస్వాల్, సురేంద్ర, బాలక్రిష్ణ, కేశవరావు, ఈశ్వరరావు, గణపతి, శ్రీరామ్, తిరుపతి ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఉద్యానవన సహాయకుల కార్యవర్గం ఎన్నిక

టెక్కలి: ఉద్యానవన సహాయకుల జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు టెక్కలిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుక్క శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా పిల్లా హరికృష్ణ, జనరల్ సెక్రటరీగా దివాకర్, ఉపాధ్యక్షునిగా కిల్లి ప్రశాంత్, కార్యదర్శిగా పిన్నింటి సంతోష్‌రెడ్డి, సంక్షేమ కార్యదర్శిగా గౌతమి, అసోషియేట్ అధ్యక్షునిగా షావుకారి నవీన్ చౌదరి, జాయింట్ సెక్రటరీగా ఆశాలత, కార్యవర్గ కార్యదర్శిగా మహాలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఉద్యానవన సహాయకుల సమస్యలను ఐక్యంగా పరిష్కరించుకుందామని అన్నారు. సమావేశంలో లోకేష్, శ్రీరాములు, గంగరాజు, రాణమ్మ, నిర్మళ, ఝాన్సీ, సుశీల, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం

వృద్ధుడికి ఆశ్రయం

కంచిలి: సోంపేట మండలం బారువ సమీపంలో వాడపాలెం గ్రామానికి చెందిన ఎటువంటి ఆదరణలేని 65 ఏళ్ల వృద్ధుడు సల్ల చిన్నారావును కంచిలి మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో చేర్చుకొన్నారు. ఆదరణ లేని వృద్ధుని కోసం తెలుసుకున్న ఆశ్రమ నిర్వాహకులు వాడపాలెం గ్రామంలో తాను నివసిస్తున్న చోటకు సోమవారం వెళ్లి ఆశ్రమానికి తీసుకొని వచ్చి ఆశ్రయం కల్పించారు. చిన్నారావు వాడపాలెంలో వ్యవసాయ పనుల్ని చేసుకొంటూ ఒంటరి తనంతో జీవితం గడుపుతుండేవాడు. ఇరుగుపొరుగు వారు అందించిన అన్నపానీయాలుతో కాలం గడపుతుండేవాడు. వయోభారంతో శరీరం సహకరించక సహాయం కోసం ఎదురు చూస్తున్న వృద్ధుడు పరిస్థితిని గ్రామస్తులు సీతయ్య ఫౌండేషన్‌కు తెలియపర్చడంతో, నిర్వాహకులు ఈ మేరకు స్పందించారు. సోంపేటకు చెందిన సానా గణేష్, వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్ ఉన్నారు.



చిన్నారావుతో ఆశ్రయం ప్రతినిధులు